ప్రజాశక్తి
శుక్రవారం 2 డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి

వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

రవాణా రంగం కుదేలు

◆ నెలకు ఒకే ఒక్క బాడుగ
◆ నెట్టుకొచ్చేదెట్టా అంటున్న లారీ యజమానులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధిక వర్షాలు, ఆర్థిక మాంద్యం ప్రభావం కలగలసి రవాణా రంగాన్ని కుదేలు చేస్తోంది. ఫైనాన్స్‌లో రుణాలు తీసుకుని వాహనాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్న లారీ యజమానులకు తిప్పలు తప్పడం లేదు. నెలకు ఒక్క బాడుగ దొరకడం కూడా గగనమైపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు చిన్నచిన్న వాటికి పడుతున్న భారీ జరిమానాలు మరింత కుంగదీస్తున్నాయన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు లారీ యజమానులు సిద్ధమవుతున్నారు.

తగ్గిన బాడుగలు

అనంతపురం జిల్లా పరిధిలోని అనంతపురం నగరంలోని బైపాస్‌లోనున్న అనంతపురం హెవీ లారీ అసోసియేషన్ పరిధిలో సుమారు వెయ్యి లారీలున్నాయి. ఇక్కడి నుంచి గతంలో రోజుకు 40 నుంచి 60 లారీలు బాడుగ నిమిత్తం బయటకెళ్లేవి. ప్రధానంగా టమోటా అనంతపురం నుంచి ఢిల్లీ మార్కెట్‌కు వెళ్లేది. ఈ సంవత్సరం అధిక వర్షాలతో పంట సరిగా రాలేదు. దీంతో ఇక్కడి నుంచి బయటకు టమోటా వెళ్లటం కూడా తగ్గింది. ప్రస్తుతం రోజుకు రెండు నుంచి గరిష్టంగా పదిలోపే ఉంటున్నాయని ఆ సంఘం అధ్యక్షులు నీలకంఠం తెలిపారు. ఎక్కువ డిమాండ్ లేకపోవడంతో లారీ బాడుగలు కూడా గతంలో రూ.1.60 లక్షలుండేది. ఇప్పుడు లక్ష రూపాయలకే పోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. అది కూడా మూడు రోజుల్లోపు ఢిల్లీ మార్కెట్‌కు చేరకుంటే రూ.40 వేల వరకు బాడుగలో కోత పడుతుందని కార్యదర్శి రిజ్వాన్ తెలిపారు. మొత్తంగా గడిచిన నెల రోజులుగా పూర్తిగా లారీలకు బాడుగలుండటం లేదు. దీంతో నెలవారీగా చెల్లించాల్సిన వాహనాల ఫైనాన్స్‌లు చెల్లించలేని పరిస్థితుల్లో లారీ యజమానులు పడ్డారని తెలిపారు.

వాహనం బొలేరో... నెంబర్ లారీది... ఫైనూ లారీకే

వాహనం బొలేరో అయితే ఫైన్ లారీకి వేయడం గమనార్హం. ఎపి02టిహెచ్2999 వాహనం లారీది. కాగా ఈ లారీని యజమాని డి.రామాంజులరెడ్డి ఇటీవలనే కర్నాటకు అమ్మేశారు. ఈ వాహనం అక్కడికి ట్రాన్స్‌ఫర్ కూడా అయ్యింది. అయితే ఈ వాహనానికి జరిమానా విధించినట్లు రామాంజులరెడ్డికి మొబైల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చింది. ఇదేమిటని వచ్చిన మేసేజ్ లింకును ఓపెన్ చేసి చూస్తే ఆ వాహనం బొలేరో పికప్‌గా ఫొటో చూపుతుండట గమనార్హం. జరిమానా వేసే అధికారులు కనీసం ఆ వాహనం నెంబరు ఏదానిదన్న తనఖీ కూడా చేయకుండానే జరిమానా విధించడం గమనార్హం.

ప్రభుత్వం వైపు నుంచి బాదుడు

అసలే ఇబ్బందులు ఎదుర్కొంటున్న లారీ యజమానులపై ప్రభుత్వ బాదుడు మరింత అదనంగా మారిందన్న ఆందోళన లారీ యజమానుల నుంచి ఉంది. ఒక్క రోజు పన్ను చెల్లించలేకపోయినా మూడు రెట్లు జరిమానాతో త్రైమాసిక పన్ను కట్టాల్సి వస్తోంది. ఇక ఎత్తులోగాని, టన్నేజీలోగానీ ఏ కొంచెం అధికంగానున్న పన్ను ఇతర రాష్ట్రాలో రూ.1500 ఉంటే ఇక్కడ ఏకంగా రూ.20వేల వరకు జరిమానా ఉంది. ఇక గ్రీన్ ట్యాక్సును రూ.200 నుంచి రూ20 వేలకు ప్రభుత్వం పెంచేసింది.

భారాలను తగ్గించాలి

ప్రభుత్వం లారీ యజమానులపై భారాలు మోపకూడదు. ఇప్పటికే గ్రీన్ ట్యాక్సు పేరుతో భారీగా పెంచారు. మరోమారు పన్ను పెంచే ఆలోచన ప్రభుత్వం చేపడుతోంది. రవాణా రంగం తీవ్రమైన సంక్షోభంలోనున్న సమయంలో రాయితీలివ్వాల్సింది పోయి భారాలువేయడం సరికాదు. గ్రీన్ ట్యాక్సును వెంటనే తగ్గించాలి.

నీలకంఠం, అనంతపురం
హెవీ లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షులు.

వేగవంతంగా రీసర్వే పనులు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీసర్వే పనులను వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలియజేశారు. గురురువారం నాడు విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి రీసర్వే, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై కలెక్టర్లతో సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బసంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ చేతన్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ భాగ్యలక్ష్మి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 26 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 13వ నోటిఫికేషన్ అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియలను సకాలంలో చేపడతామన్నారు. జిల్లాలో రీ సర్వే పనులు త్వరితగతిన చేపట్టేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్, గ్రౌండ్ వాల్యుడేషన్, తదితర ప్రక్రియలను వేగవంతం చేస్తామని తెలిపారు.

మొదటి దశలో ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ల గ్రౌండింగ్ పూర్తి

జిల్లాలో మొదటి దశలో మంజూరైన ఎంపిఎఫ్‌సి(మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్‌లకు సంబంధించి గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేసినట్లు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబుకి కలెక్టర్ బసంత్ కుమార్ వివరించారు. గురువారం నాడు విజయవాడ నుంచి ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ల నిర్మాణం, తదితర అంశాలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డిసిఒ కష్ణనాయక్, ఎడిసిసి బ్యాంక్ జనరల్ మేనేజర్ సురేఖ రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిఎఫ్‌సి గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మొదటి దశలో 72 గోడౌన్లు మంజూరు అయ్యాయని చెప్పారు. వాటి గ్రౌండింగ్‌ను పూర్తి చేశామన్నారు. రెండవ దశలో 55, మూడవ దశలో 22 ఎంపిఎఫ్‌సి గోడౌన్లు మంజురుకాగా, దశలవారీగా వాటి గ్రౌండింగ్ చేపడుతున్నామన్నారు.

పట్టణ సమన్వయకర్త నియామకానికి

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాలకు సమన్వయకర్త పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో పట్టణ సమన్వయకర్త ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఇందుకు సంబంధించి అభ్యర్థులు డిసెంబర్ 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గ్రామ వాలంటీర్ల వ్యవస్థ, సచివాలయల ద్వారా జరుగుతున్న వివరాలు సేకరించడం, విశ్లేషించడం తదితర పనులను సమన్వయకర్త చేయాల్సి ఉంటుందన్నారు. పోస్టులను నేరుగా లేదా డిప్యూటేషన్‌పై భర్తీ చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి దరఖాస్తులను డిసెంబర్ 5వతేదీ లోపు కలెక్టర్ (విడబ్ల్యూఎస్‌ఓ), సిపిఎం కార్యాలయం, కలెక్టరేట్ శ్రీ సత్య సాయి జిల్లా, పుట్టపర్తి అనే చిరునామాకు సమర్పించాలన్నారు.

వేతనం, అర్హతలు

పట్టణ సమన్వయకర్త వేతనం నెలకి రూ.27 వేలు ఉంటుంది. కంప్యూటర్ పీజీ కోర్స్ పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి. పట్టణ సమన్వయకర్త కార్యక్రమాల అమలులో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 50 ఏళ్లు మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

విలేఖరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరంలో మితిమీరిన భూకబ్జాలు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం టౌన్ : మూడున్నర సంవత్సరాలుగా నియోజకవర్గంలో భూకబాలు, దౌర్జన్యాలు, రౌడీయిజం మితిమీరిపోయాయని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న ధర్మవరాన్ని రావణకాష్టం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న నివాసాలకు సంబంధించి కోర్టు ఇచ్చి స్టే పత్రాలను బాధితులకు అందజేశారు. అనంతరం తన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాంట్ ఎదురుగా ఉన్న కాలనీలో దాదా 40ఏళ్లగా చాలామంది పేదలు నివాసం ఉంటున్నారన్నారు. అయితే కొందరు అధికారపార్టీ నాయకులు ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేశామని, ఇంటి విస్తీర్ణాన్ని బట్టి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు తమ దృష్టికి తెచ్చారన్నారు. దీంతో వారి తరపున హైకోరుకు వెళ్లి స్టే తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇకపై ఆ స్థలంపై పోలీసులు, అధికార పార్టీ నాయకులు కలుగజేసుకోరాదని సూచించారు. ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఖాళీస్థలాలు, విలువైన స్థలాలను గుర్తించి వాటిని తక్కువ ధరకు దౌర్జన్యంగా తీసుకుని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక అలాంటి భూములను బాధితులకే తిరిగి ఇప్పిస్తామన్నారు. ఆర్డీవో, తహశీల్దార్లు అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిసున్నారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా దొంగ రిజిస్ట్రేషన్లు ఎక్కువ అయ్యాయన్నారు. అలాగే రేగాటిపల్లి, చిగిచెర్ల సొసైటీ భూములను కూడా కాజేయాలని చూస్తున్నారని, వాటిపై హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చామన్నారు. అధికార పార్టీ నాయకుల మాట వింటూపోతే అధికారులకు కూడా జైలుకెళ్లక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, టిడిపి శీన, గొట్లూరు చంద్ర, తుంపర్తి పరమేష్, చిలకం సూర్యనారాయణరెడ్డి, పోతుల నాగేపల్లి లక్ష్మీనారాయణ, వీరప్ప, ముదిగుబ్బ నాయకులు నారాయణస్వామి, దేవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను పెంపొందించుకోవాలి

హిందూపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాజ్యాంగ విలువలను పెంపొందించుకుని అందుకు అనుగుణంగా సమాజాభివృద్ధికి కృషి చేయాలని న్యాయమూర్తి స్పందన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మితో కలిసి పట్టణంలోనిఎంజీఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తమకు ఇష్టమైన రంగాల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా అదేవిధంగా భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, బాధ్యతలు గ్రహించి వాటికి అనుగుణంగా జీవించాలన్నారు. అనంతరం భారత రాజ్యాంగం హక్కులు, విధులు అన్న అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఇస్మాయిల్, ఎపిపి ఇందాద్, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, బాల అసోసియేషన్ ప్రతినిధులు నాగప్ప, సుదర్శన్, సిద్ధూ, లోక్ అదాలత్ విభాగం సిబ్బంది శారదా, హెచ్‌ఎం సామ్రాజ్యం, న్యాయవాదులు కళావతి, రత్నమ్మ, సంతోషి, నవేరా తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకుని దానిని పూర్తిగా రూపుమాపేందుకు రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. గురువారం నాడు ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలనా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం నుంచి సత్యమ్మ దేవాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కలెక్టరేట్ వద్ద ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నిర్మూలన పట్ల విస్తతంగా అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారి వివరాలు, వారికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా అందుతున్న సహాయ సహకారాల గురించి జెసి ఆరా తీశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా॥ఎస్‌వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఒక నినాదాన్ని ఇస్తుందన్నారు. ఈ సంవత్సరం 'సమానత్వం' అనే నినాదంతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకోవాలని సూచించిందని తెలిపారు. ఈ ర్యాలీలో వెంకటేష్ కళాజాత బందం వీధి నాటక కళారూపం ద్వారా ప్రజలకు హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, బుక్కపట్నం వైద్యాధికారి డా॥సునీల్, డెమో బాబా ఫకర్దీన్, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం డిపిఎం వెంకటరత్నం, టిబి.సూపర్‌వైజర్ హబీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం..

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడదామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో డిసెంబర్ 2 నుంచి చేపట్టనున్న ఇదేంకర్మ – మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని పోస్టర్లను గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అభివృద్ధిని మరిచి కేవలం ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రానికి పట్టిన గతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధులు రొద్దం నరసింహులు, రఘువీరాచౌదరి, సీనియర్ నాయకులు రామకిష్టప్ప, అశ్వర్థనారాయణ, మండల కన్వీనర్ సిద్ధయ్య, టౌన్ కన్వీనర్ రవిశంకర్, నాయకులు శ్రీనివాసులు, రామలింగానాయుడు, టౌన్ మహిళా కన్వీనర్ గాయత్రి, నాయకురాలు చంద్రకాంతమ్మ, ఖదీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో కొనసాగుతున్న నియంతపాలనను అంతమొందించడానికి ప్రజలందరి భాగస్వామ్యం చాలా అవసరమని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జిల్లావ్యాప్తంగా 45 రోజుల పాటు నిర్వహించనున్న 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజలపై మోపుతున్న భారాలపై చర్చించడంతోపాటు స్థానిక సమస్యలు తెలుసుకుని ప్రజలకు అండగా ఉండనున్నట్లు తెలిపారు. మద్యం, ఇసుకదందా, నిరుద్యోగ సమస్య, ఇంటి పన్ను, కరెంటు సమస్య, డీజిల్, పెట్రోల్, నిత్యావసరుకుల ధరలు పెరగడం తదితర అంశాలపై ప్రజలతో చర్చించి వారి బాధలను పంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, చింతలపల్లి మహేష్‌చౌదరి, బోయ రవిచంద్ర, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, మేకల రామాంజినేయులు, పోతుకుంట లక్ష్మన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, రాంపురం శీన, రాళ్లపల్లి షరీఫ్, ఆంబటి సనత్, గంగారపు రవి, గోసల శ్రీరాములు, పల్లపు రవీంద్ర, టైలర్ కుళ్లాయప్ప, కరెంటు ఆది, కేతినేని రాజ, కేశగాళ్ల శీన, చట్టా లక్ష్మీనారాయణ, మహిళా నాయకురాలు, సాహెబ్బీ, బీబీ తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి పోస్టర్లను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

ఐక్యంగా ఉద్యమిద్దాం..

హిందూపురం : పురపాలక సంఘంలోని క్లాప్ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు సిఐటియు కార్మిక సంఘంలో చేరాలని సిఐటియు పట్టన అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, నరసంహ్మప్ప పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం స్థానిక ఇందిరాపార్కులో క్లాప్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతు క్లాప్ కార్యక్రమంలో భాగంగా ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతోపాటు ప్రతినెలా వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, క్లాప్ కార్మికులు పాల్గొన్నారు.

క్లాప్ కార్మికులతో చర్చిస్తున్న సిఐటియు నాయకులు

భవన నిర్మాణ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

అర్ధనగ్నంగా కలెక్టరేట్ ముందు ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ముందు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భ.ని.కా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాంబశివ, సిఐటియు మండల కార్యదర్శి గౌస్‌లాజాం మాట్లాడుతూ 2009లో పోరాడి సాధించుకొన్న సంక్షేమ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. కూలి చేసుకునే కార్మికుల కడుపు కొడుతూ, కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు నుంచి ప్రభుత్వం వివిధ పథకాలకు సంబంధించిన రూ.1,280 కోట్లు వాడుకోవడం బాధాకరమన్నారు. ఆ నిధులు జమ చేసి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇసుక మాఫియాను అరికట్టి ఇసుకను ఉచితంగా ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భ.ని.కా సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రామకష్ణ, కోశాధికారి ముత్యాలు, కార్మికులు బాబయ్య, మురఫ్, వెంకటేశు, సుధాకర్, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ హమీద్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు నిర్మాణ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వారు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ బోర్డులను నిర్వీరం చేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నామన్నారు. వెంటనే భవన నిర్మాణ కార్మిక చట్టాలను అమలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప , భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు మూర్తి, నాగరాజు, శ్రీరాములు, అంజి, ముత్యాలు, కెవిపిఎస్ నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో జూనియర్ అసిస్టెంట్ హమీద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో వక్తలు

మడకశిరలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ప్రజాశక్తి-మడకశిర

మానవాళిపై మరణ శాసనాన్ని లిఖిస్తున్న ఎయిడ్స్ మహమ్మారి నివారణకు కృషి చేద్దామని ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ సూపరింటెండెంట్ విజయ, లక్ష్మమ్మ, డాక్టర్ పద్మజ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ, ఐసిటిసి ఆధ్వర్యంలో పట్టణంలో డిగ్రీ, జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ సురక్షితం కానీ లైంగిక సంబంధాలను ఎలాంటి పరిస్థితుల్లో పెట్టుకోకూడదన్నారు. వీటితోపాటు కలుషితమైన సూదులు, సిరంజిలు వాడకుండా డిస్పోజల్ సిరంజిలను వాడాలని సూచించారు. అలాగే రోగులకు కలుషిత రక్తం శరీరంలోకి ఎక్కించుకోకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వర్థనారాయణ, ఐసిటిసి కౌన్సిలర్ నరసింహులు, అరుణ్, హెడ్నర్స్ మంజుల, గీతాంజలి, నర్సింగ్ సూపరింటెండెంట్ వరలక్ష్మి, టీబీ టీం మురళీ, రక్త నిధి సిబ్బంది బాబు, కళాశాలల ప్రిన్సిపల్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీనివాసులు, ఫోర్డ్ సంస్థ బోర్డ్ సభ్యుడు మాలింగప్ప, రమేష్, కవిత, అనిత, గీత, లలిత, సాకమ్మ, రంగలక్ష్మితోపాటు కళాశాలలకు చెందిన విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందూపురం-కదిరి ప్రధాన రహదారిపై డాక్టర్ ఐనోద్దీన్, డాక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాంట్ సర్కిల్‌లో మానవహారం నిర్మించి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో ఎంపిహెచ్ఇఒ లాలూనాయక్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మహేశ్వర్, మారుతి, హెచ్ఐవి డేవిడ్ రాజు, ఎటిఎల్ కృష్ణ, వైద్య సూపర్‌వైజర్లు ఉపేంద్రరెడ్డి, వై.రవికుమార్, వైద్య, ఆర్డీటీ సంస్థ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఆశావర్కర్లు పారామెడికల్ సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీనియర్ సివిల్ జడ్జి శంకర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు సయ్యద్, భాగ్యలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నూర్ మహమ్మద్, నందకుమార్, జన జాగృతి ప్రతినిధులు శశికళ, ఆశా వర్కర్లు, లెక్చరర్లు, విద్యార్థులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య చికిత్స కేంద్రంలో ఎంపిపి పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రత పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేంద్రనాథ్, జానకిరామ్, ఆశావర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం, కోటి సాయిలిపి డిగ్రీ కళాశాల, తంబాపురం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది వేర్వేరుగా ర్యాలీల నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎయిడ్స రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపెసుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు పోవడంతోపాటు కుటుంబం వీధిన పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి తేజశ్రీ, సీహెచ్ రాజశేఖర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, నారమ్మ, ఆర్డీటీ కేర్ అండ్ సపోర్టు సెంటర్ రాధ, ఎటిఎల్ రుక్మాంగద, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్ర, ఎస్టీఎల్ వనజ, ఉమెన్స్ సెక్టార్ ఎస్టీఎల్ కావేరి, సీఓలు వెంకటేష్, తిమ్మరాజు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మున్వర్ భాష ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మెయిన్ రోడ్డు మీద మూడు రోడ్లు కూడలి వరకు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మున్వర్‌బాషా, రోజా, కదిరి మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లింగన్న విద్యాసంస్థల నిర్వాహకులు కేటీ శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సేవామందిర్ ఆర్‌డిటి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రం ఎయిడ్స్ ప్రభావిత రాష్ట్రాల్లో రెండవ స్థానంలో ఉండటం సిగ్గుచేటన్నారు. ప్రతి ఒక్క యువకుడు ఎయిడ్స్ నిర్మూలనకు పని చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌బాబు, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఆర్డిటి ఎటిఎల్ నారాయణస్వామి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది, జనజాగృతి ప్రతినిధులు

లేపాక్షి : మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం ఎంపిహెచ్ఒ హుస్సేన్‌బీ, భాగ్యలక్ష్మి, పిహెచ్ఎన్ గోవిందప్ప, ల్యాబ్ టెక్నీషియన్, సందీప్‌కుమార్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు భయం వీడి సామాన్యుల తరహాలో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సుపరిటెండెంట్ రాజగోపాల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు జెఇ వెంకటస్వామి, ఆర్ఎంఒ రుక్మిణమ్మ, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు నాగప్ప, సుదర్శన్, సిద్దు, న్యాయవాదులు సంతోషి, కళావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే సప్తగిరి కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి సంస్థల ప్రిన్సిపళ్లు శివశంకర్ రెడ్డి, మంజునాథ్, ఏఓ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు కరణం గోపీనాథ్ రావు, ప్రకాష్, పార్థసారథి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : ప్రపంచ మహమ్మారి హెచ్ఐవిని తరిమికొడదామని పలువురు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జన జాగృతి సంస్థ అధ్వర్యంలో గురువారం పట్టణంలో జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, న్యాయవాది నరసింహులు, ఎఆర్‌టి సిబ్బంది, జన జాగృతి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, జూనియర్ ప్రిన్సిపల్ చెన్న కేశవప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఒకేరాత్రి నాలుగు ఇళ్లల్లో చోరీ

మడకశిర రూరల్ : మండల పరిధిలోని గుర్రపుకొండ గ్రామంలో బుధవారం రాత్రి పుట్టమ్మ, బాలరామప్ప, మాలమ్మ, భీమ్లానాయక్ ఇళ్లల్లో చోరీ జరిగింది. ఆయా ఇళ్లకు తాళాలు వేసి శుభకార్యానికి వెళ్లగా గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి ఇళ్లల్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారని సర్పంచి నరసేగౌడ్ గురువారం వాపోయారు. అలాగే బలరామప్ప ఇంటిలో హుండీ ఎత్తుకెళ్లారని తెలిపారు. మిగిలిన వారి ఇళ్లల్లో బీరువాలు పగులగొట్టి చిల్లర నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలిని కాపాడిన యువకులు

బుక్కపట్నం : బుక్కపట్నం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న వృద్ధురాలిని యువకులు కాపాడిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గురువారం సాయంత్రం ఓ వృద్ధురాలు చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా వాకింగ్ కోసం వెళ్లిన కొందరు యువకులు కాపాడారు. వెంటనే ఎస్ఐ నరసింహుడుకు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి వృద్ధురాలిని అదుపులోకి తీసుకుని విచారించాడు. వృద్ధురాలు తనది పుట్టపర్తి మండలం వీర జిన్నయపల్లె అని జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. తర్వాత కుటుంబ సభ్యులతో మాట్లాడి అప్పగించారు.

దీప్తి పాఠశాల తనిఖీ

డివైఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం : పట్టణంలోని దీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను డిప్యూటీ డిఇఒ రంగస్వామి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివే విద్యార్థులకు సంబంధించిన ఫీజుల వివరాలు బోర్డు లేకపోవడం, అనుమతి లేకుండా భవనాలు నిర్మాణం చేయడం తదితర విషయాలను గుర్తించి యాజమాన్యంతో చర్చించారు. నాలుగో అంతస్తు నిర్మాణానికి సంబంధించిన అనుమతులను శుక్రవారం మధ్యాహ్నం లోపు తనకు అనుమతి పత్రాలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఫీజు వివరాల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలితో పాటు ఇతర విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని దీప్తి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవి, అభి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి అర్బన్ : ప్రమాదాల వల్ల అనారోగ్యంతో మృతిచెందిన, బాధపడుతున్న బాధిత కుటుంబాలను మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గురువారం పరామర్శించి భరోసా కల్పించారు. ఇందులో భాగంగా ఎనుములపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టిడిపి కార్యకర్త చాకలి ఓబులప్ప, మంగల నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే పెద్దకమ్మవారిపల్లెలో మృతిచెందిన ముమ్మనేని గోపాల్ భార్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహమ్మద్ రఫీ, సామకోటి ఆదినారాయణ, కోనంకి నాయుడు, జిల్లా ఈడిగ సాధికారిక అధ్యక్షుడు నీళ్ల రమణ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కదిరిటౌన్ : క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని మసనంపేటకు చెందిన మల్లికకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆర్థికసాయం చేశారు. ఈమేరకు వైద్య ఖర్చుల నిమిత్తం భర్త తాజుద్దీన్‌కు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బత్తల ఆదినారాయణ, సంపంగి గోవర్ధన్, యేసు, పట్నం షామీర్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

నల్లచెరువు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జలజీవన్ మిషన్, హర్ ఘర్ జల్ పథకంపై మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అంగన్వాడీలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ జిల్లా మేనేజర్ నాగాంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 2024 సంవత్సరంలోగా రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిని అందించడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐఇసి కోఆర్డినేటర్ మౌలేశ్వరుడు, ఆర్ఐఎస్ఇఎస్ సంస్థ ఛైర్మన్ నారాయణరెడ్డి, గోపాలరెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌టి.హళ్లి పాఠశాల పరిశీలన

రొళ్ల : మండల పరిధిలోని హెచ్‌టి హళ్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి గురువారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు దారిలేక వర్షకాలంలో విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణణాతీతం అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పాఠశాలకు ఆర్ఎంబి రోడ్డుతోపాటు పెద్ద వంకలో బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. తాను కూడా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రమేష్, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

అగళి : ప్రజలు 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది వారికి ఒకసారి గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. పేదలు గ్రామం వేరే ప్రాంతాలకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే దగ్గు, జలుబు, జ్వరం, బిపి, షుగర్ వంటి రోగాలకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. అలాగే గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించడంతోపాటు కావాల్సిన మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివానంద, సంతోష్, ఎంఎల్ హెచ్‌పి గీత, ఎంపిహెచ్ ఎం.సుధాకర్‌రాజు, 104 డిఇ జ్ఞాన్‌దేవ్, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

జాతీయ నాయకుల విగ్రహాలకు జలాభిషేకం

హిందూపురం : పట్టణవ్యాప్తంగా వివిధ కూడళ్లల్లో ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది గురువారం జలాభిషేకం చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది విగ్రహాలకు ఎప్పుడో వేసి ఎండిపోయిన పూలమాలలు, దుమ్ము ధూళిని తొలగించి నీటితో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు, స్థానిక నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు పరామర్శ

కదిరిటౌన్ : కదిరి రూరల్ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలో పలువురు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ గురువారం పరామర్శించారు. పంచాయతీ పరిధిలోని బండాలపల్లిలో టిడిపి నాయకులు వెంకటేశును, చెర్లోపల్లిలో చౌడప్ప, రామచంద్ర, దిగువపల్లిలో మస్తాన్, మల్లయ్యగారిపల్లెలో రఘురామ్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్య పడకండి.. అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చెన్నకేశవులు, మాజీ సర్పంచి కొండయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికె సేవలను వినియోగించుకోండి

రొద్దం : రైతులందరూ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రైతు సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి కోరారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల రైతు సలహా మండలి సభ్యులు, రైతులు, ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలన్నారు. ఎడిఎ స్వయంప్రభ, డిఆర్‌సిలు సనావుల్లా మొక్కజొన్న, పత్తి, పప్పుసెనగ పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నివేదిత, ఎఇఒ అంజాద్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

ధర్మవరం టౌన్ : వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఈమేరకు సేవ్ ధర్మవరం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 8వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై ధర్మవరంలో అన్నివర్గాల ప్రజలు వేలాది మంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అలాంటి చేనేత పరిశ్రమను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయన్నారు. పాలకుల తీరు వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. అంతేగాకుండా ధర్మవరంలో భూకబ్జాలు, దాడులు, రౌడీయిజాలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఆధార్ కార్డు అనుసంధానం పకడ్బందీగా చేపట్టాలని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ ఆయా బీఎల్ఓలను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు చెందిన బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరితో ఫారం6ను తీసుకోవాలన్నారు. చనిపోయిన వారిని క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరాలు సేకరించి ఓటరు జాబితాలో నుంచి తొలగించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో నుంచి వచ్చిన వారి చిరునామాలు మార్పులకు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తాడిమర్రి, బత్తలపల్లి మండలాల తహశీల్దార్లు నాగరాజు, యుగేశ్వరిదేవి, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, డీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

మార్కండేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెట్ వీధిలో వెలసిన భద్రావతి సమేత భావనా రుషీంద్రులస్వామి ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాల్లో భాగంగా గురువారం హోమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విష్వేవారాధనం, పుణ్యాహవాచనం, రక్తాబంధన పూజ, పంచగవ్య ఆరాధనం, ఆచార్య వరణం వంటి పూజలు చేశారు. సాయంత్రం అగ్నిమథనం, అగ్నిప్రతిష్టాపనం, కుంభాసాదనం, కుంభస్థాపనం, ఉక్తహోమాలు నిర్వహించారు. ఉత్సవాలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు రూ.50వేలు విరాళం అందజేశారు. అలాగే ఆలయానికి బోడగల సావిత్రమ్మ, నారాయణప్ప జ్ఞాపకార్థ కుమారులు బోడగల శ్రీనివాసులు అండ్ సన్స్ 108-కిలోల పంచలోహ మార్కెండేయ, శివలింగ ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలియ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్నసింగరయ్య, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి జింకా చిన్నప్ప, సహాయ కార్యదర్శి బోడగల శంకర, కోశాధికారి పారాళ పుల్లయ్య, సభ్యులు గోలి నాగభూషణం, గడ్డం రామకృష్ణ, జింకా మోహన్‌బాబు, కట్టా గోవిందు, పోలంకి పెద్ద రెడ్డప్ప, జింకరెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

మార్కెండేయ, శివలింగ 108 కిలోల పంచలోహ ఉత్సవ విగ్రహాలను బకరిస్తున్నదాతలు

సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని బండపల్లి ఎస్సీ కాలనీలో భూకబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయం కార్యదర్శి సాయికి సిపిఎం నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ బండపల్లి పాత ఎస్సీ కాలనీలో 40 దళిత కుటుంబాలు పూర్వకాలం నుంచి అనుభవిస్తున్న ప్రభుత్వ భూమిని శంకరప్ప, నారాయణరెడ్డి, అంజనప్ప అనే వారు ఆక్రమించుకున్నారన్నారు. కావున అనుభవిస్తున్న వారికే ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, గంగాధర్, ఎస్సీ కాలనీవాసులు అంజనప్ప, నరేష్ అంజనమ్మ, హనుమక్క, తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

అమడగూరు : మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మా కొట్టడంతో తూతూమంత్రంగా ముగించేశారు. ఇందులో భాగంగా మండలంలో రోడ్లు, ఇంటింటికీ కొళాయిలు, పశువులకు లంపీ వైరస్ వంటి సమస్యలు నెలకొన్నాయి. వాటిపై చర్చిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. కాగా సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపిడిఒ నసీమా తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రెడ్డి శేఖర్, జడ్పిటిసి కవిత శివశంకర్‌రెడ్డి, ఎఒ వీరాజోష్ణ, ఎంఇఒ జాన్ రెడ్డప్ప, పంచాయతీ రాజ్ గుప్తా, సర్పంచి షబ్బీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, వివిధ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

'గడప గడపకు'తో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి

ప్రజాశక్తి-అమరాపురం

సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని మద్దనకుంటలో సర్పంచి గోవిందప్ప అధ్యక్షతన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నామన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులు, గృహాలు, రైతు భరోసా, జగనన్న విద్యార్థి వసతి దీవెన, అమ్మఒడి వంటి అనేక పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు బాగాల చిక్కన్న, ఎంపిపి ఈరన్న, జడ్పిటిసి స్వరక్క నరసింహమూర్తి, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, ఎంపిటిసి హనుమంతరాయ, నాయకులు టైలర్ కెంచప్ప, గడ్డం రాజు, జక్ మూర్తి, డీలర్లు తిప్పేస్వామి, శివకుమార్, ఉదుగూరు తిప్పేస్వామి, పేలుబండ ప్రసాద్, పుల్లికుంట మంజునాథ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

హిందూపురం : రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. గురువారం హిందూపురం పురపాలక సంఘ పరదిలోని 35వ వార్డు మార్కండేయ నగర్, వెంకటేష్ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్‌లు జబీవుల్లా, బలరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ మద్దెన జయప్ప, కౌన్సిలర్లు మారుతీరెడ్డి, అయూబ్, ముస్తాక్, రోషన్ అలీ, మణి, రహమత్‌బి, గిరీష్, మల్లికార్జున, నాగేంద్రమ్మ, కో-ఆప్షన్ సభ్యులు రహమత్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి : గ్రామానికి రహదారి ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మండలంలోని బోరెడ్డిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే శంకరనారాయణకు విన్నవించారు. గురువారం మండలంలోని మూడిండ్లపల్లి, చిన్నపల్లి, బోరెడ్డిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా 15 ఏళ్లుగా పరిగి నుంచి గోరెడ్డిపల్లికి వచ్చే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందని, టిడిపి హయంలో రహదారికి కంకర వేసి రోడ్డు నిర్మాణం మరిచారని మీరైనా స్పందించి రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచి లక్ష్మీదేవి, నాయకులు శివశంకర్, ప్రభాకర్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ